క్లుప్తంగా

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మందస: మండలంలో భైరిసారంగపురం పంచాయతీ రాధాకృష్ణపురం సమీపంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ ఎల్.లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థినుల నుంచి దరఖాస్తులను కోరుతున్నామని పేర్కొన్నారు. ఈ నెల 23లోగా హెచ్‌టిటిపి://ఏపిబిఆర్ఏజిసిఇటి.ఏపిసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 5వ తరగతిలో ప్రవేశానికి మార్చి 10న ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడియట్‌కు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9704550012 నంబరును సంప్రదించాలని కోరారు.

జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు పూజిత



హడ్డుబంగి పూజిత

టెక్కలి: హిమాచల్‌ప్రదేశ్‌లో ఈ నెల 7 నుంచి జరగనున్న జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన సీఎస్ఈ తృతీయ సంవత్సరం విద్యార్థిని హడ్డుబంగి పూజిత ఎంపికైనట్లు కళాశాల డైరక్టర్ వి.వి.నాగేశ్వరరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సీహెచ్ఈ హెచ్‌ఓడీ యు.డి.ప్రసన్న, స్పోర్ట్స్ కన్వీనర్ పి. మురళీధర్, పీడీలు ఎస్.లక్ష్మణమూర్తి, టి.మురళీమోహన్, జె.తేజేశ్వరి, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ డి.వెంకటేష్ తదితరులు అభినందించారు. జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.

చిన్నారుల ఔదార్యం



నిర్వాహకులకు సాయం అందిస్తున్న చిన్నారులు

కంచిలి: మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమం ఆవరణలో నూతనంగా నిర్మించనున్న దివ్యాంగుల పునరావాస కేంద్ర భవనానికి పలు పాఠశాలల చిన్నారులు స్వచ్ఛందంగా వచ్చి ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు. సోంపేట పట్టణానికి చెందిన శారదా విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి రూ.20 వేలు, ఇచ్ఛాపురం మండలం కొఠారి గ్రామస్తులు రూ.20వేలు ఆర్థిక సాయాన్ని ఆశ్రమ నిర్వాహకులు గుర్ల రమేష్‌కు గురువారం అందజేశారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలోనే అన్ని ప్రాంతాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతున్నాయని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. పెద్దశ్రీరాంపురం పంచాయతీ పరిధిలో ప్రయాణికుల విశ్రాంతి భవనం, బోరు, వాటర్ ట్యాంక్, డ్రైనేజీపై ప్లేట్లు ఏర్పాటుకు ఎంపీపీ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు లద్దుకేశవపాత్రో, కొణపల సురేష్, తాండ్ర సురేష్, తలగాన భాస్కర్, తలగాన తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ జేఏసీ కార్యవర్గ ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

ఇచ్ఛాపురం: సమగ్రశిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) జేఏసీ ఇచ్ఛాపురం కమిటీ నూతన అధ్యక్షుడిగా బడే గణేష్ నియమితులయ్యారు. పట్టణంలోని మండల విద్యావనరుల కేంద్రం ఆవరణంలో గురువారం జరిగిన ఈ ఎన్నికలో ఉపాధ్యక్షుడిగా చల్లా సత్యన్నారాయణ, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.సూర్యం, ఆశి రవికుమార్‌రెడ్డి, కోశాధికారిగా నర్తు యాదవరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రభుత్వ లబ్ధిని వివరించండి



మాట్లాడుతున్న భారతిదివ్య

ఇచ్ఛాపురం: జగనన్న ప్రభుత్వం చేసిన లబ్ధిని ప్రతి కుటుంబానికి వివరించాలని ఇచ్ఛాపురం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య వలంటీర్లకు సూచించారు. ఈ మేరకు గురువారం మున్సిపాలిటీ లో 17వ వార్డు సచివాలయంలో వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఎంఎల్ఓ సాయిసందీప్, వైఎస్సార్ సీపీ నాయకులు టెంక లోకేశ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

తెల్లారేసరికే పింఛన్..



వైఎస్సార్ పెన్షన్ కానుక అభాగ్యులకు అండగా నిలుస్తోంది. ప్రతి నెలా ఒకటో తారీఖున తెల్లవారేసరికి వలంటీర్లు అవ్వాతాతల్ని, దివ్యాంగులను ఆప్యాయంగా పలకరించి పింఛన్లు అందజేస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం ఇచ్ఛాపురం పురపాలకసంఘం పరిధిలో మంచానికే పరిమితమైన దివ్యాంగుడు నెయ్యల మురళీకి వలంటీర్ దివాకర్ పింఛన్ అందజేశారు.

వైద్యానికి పింఛనే ఆధారం

ఉద్దానం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన సంగారు కనకరాజు కిడ్నీ బాధితుడు. మందులు, చికిత్సకు కిడ్నీ పింఛన్ ఒక్కటే ఆధారం. గతంలో చికిత్స కోసం అప్పు చేయాల్సి వచ్చేది. సీఎంగా జగనన్న వచ్చాక రూ.10 వేలు పింఛన్ మంజూరైంది. ఎప్పట్లాగే ఈ నెల పింఛన్ కూడా గురువారం ఉదయాన్నే స్థానిక సర్పంచ్ చింత హేమారావు ఆధ్వర్యంలో వలంటీర్ పుచ్చ వనిత రూ.10వేలు పింఛన్ అందించారు.





ఇచ్ఛాపురం మండలం నీలాపుట్టుగలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నీలాపు గీత



సోంపేట మండలం గొల్లూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపీపీ నిమ్మన దాస్

సోంపేట/వజ్రపుకొత్తూరు/ఇచ్ఛాపురం/రూరల్: రాష్ట్రంలో ప్రతి నిరుపేద కుటుంబానికి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అన్నారు. సోంపేట మండలం గొల్లూరు పంచాయతీలో గురువారం పింఛన్లను, రేషన్ కార్డులను ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేసిన సహాయానికి రుణం తీసుకునే సమయం ఆసన్నమైందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బతకల మోహనరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, సర్పంచ్ పిన్నింటి ఈశ్వరరావు, ఎంపీటీసీ పిన్నింటి ఝాన్సీ, వైఎస్సార్ సీపీ నాయకులు రేఖారావు, శేషగిరి, మర్ల శంకరరావు, మూల గోపాలకృష్ణ, బైపల్లి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

సోంపేట: ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అన్నారు. సోంపేట మండలం బారువ మేజర్ పంచాయతీ సచివాలయం-2 పరిధిలో గురువారం గడపగడపకు ప్రభుత్వ కార్యక్రం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. అనంతరం జగనన్న కాలనీలో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, వైస్ ఎంపీపీ గురాల శ్రీను, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ మద్దు రాజారావు, మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, జేసీఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, సర్పంచ్ యర్ర రజని, నాయకులు అమర లోకనాథం, పెద్దింటి రాజారావు, జానకిరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లతో విద్యార్థులు

మందస: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సాంకేతికతతో విద్యార్థులకు ఉత్తమ విద్య లభిస్తోందని సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.సుందర్‌సాల్మన్ అన్నారు. విద్యార్థులకు గురువారం బైజూస్ కంటెంట్ ఉన్న ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.అప్పారావు, ఎస్.కరుణాకర్, ఎస్.నారాయణరావు, పి.చంద్రశేఖర్, కె.విజయ్, కె.వెంకటరమణ, ఆర్.చంటిబాబు, వై.తులసీదాస్, జ్యోత్స్న, వై.జయరాం తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటిద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న ఎంవీఐ, వాహనచోదకులు

కాశీబుగ్గ: ప్రతిఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించాలని పలాస ఎంవీఐ వై.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు గురువారం పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో ద్విచక్ర వాహనచోదకులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పలాస ఎంవీఐ కార్యాలయం నుంచి కాశీబుగ్గ మూడు రోడ్లు కూడలి మీదుగా పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు.

సంక్షిప్తంగా..

కింగ్‌కోబ్రా హతం



14 అడుగుల పాము

మందస: సొండిపూడి పంచాయతీ పరిధిలోని కింగ్‌కోబ్రా కలకలం సృష్టించింది. సుమారు 14 అడుగుల మేర ఉన్న ఈ పాము బావిలో పడి మృతిచెందడంతో స్థానికులు బయటకు తీశారు. పామును చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపారు.

రూ.20 లక్షల బీమా చెక్కు అందజేత

సోంపేట: మండలంలోని పాలవలస గ్రామానికి చెందిన తోట చంద్రావతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఈమెకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు కొర్లాం శాఖ ద్వారా ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ఉంది. దీనిలో భాగంగా నామిని భాస్కరరావుకు గురువారం బ్యాంకు రీజనల్ మేనేజర్ ఎల్.అనంతరావు రూ.20 లక్షల చెక్ అందజేశారు. కార్యక్రమంలో కొర్లాం బ్రాంచి మేనేజర్ సతీష్ పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష తగదు



ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్, వైద్యాధికారి, సిబ్బంది

వజ్రపుకొత్తూరు రూరల్: కుష్టువ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఏ.తేజాశ్విత అన్నారు. పెద్దబొడ్డపాడు గ్రామ సచివాలయం వద్ద గురువారం సర్పంచ్ తమ్మినాన ఢిల్లీరావు సమక్షంలో 'స్పర్శ' లెప్రసీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చక్రధర్, ఆశా కార్యకర్తలు టి.చిన్నమ్మ, బి.తేజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యాలను పూర్తి చేయాలి

కవిటి: ఉపాధి హామీ పథకం లక్ష్యాల్ని సత్వరమే పూర్తిచేయాలని డీఎల్‌డీఓ, ఏపీడీ సీహెచ్ శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం కవిటి మండల ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఏపీఓ కడియం భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆపరేటర్ల నిరసన

టెక్కలి రూరల్: టెక్కలి పరిధిలోని వివిధ గ్రానైట్ క్వారీలలో పనిచేసే ప్రొక్లెయిన్ ఆపరేటర్లు గురువారం స్థానిక వలేసాగరం వద్ద నిరసన చేపట్టారు. ఉద్యోగ భద్రత కల్పిస్తూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌కు వినతిపత్రం అందించారు.

సాలగ్రామ శివలింగానికి పూజలు



కవిటి: మండలంలోని ముత్యాలపేటలో నూతనంగా నిర్మించిన మృత్యుంజయేశ్వర ఆలయంలో ప్రతిష్ఠించేందుకు సాలగ్రామశివలింగం గురువారం గ్రామానికి చేరుకుంది. ఈ నెల 17, 18, 19 తేదీల్లో ప్రతిష్ఠ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు.

కొత్త అధికారుల నియామకం

అరసవల్లి/మందస/టెక్కలి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పలు మండలాలకు కొత్త ఎంపీడీఓలను నియమించారు. స్థానిక ఎంపీడీఓలను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. కొత్త ఎంపీడీఓలు గురువారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయను, జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్‌రామన్‌ను వారంతా మర్యాదపూర్వకంగా కలిశారు. మందస తహసీల్దార్ బడే పాపారావు స్థానంలో ఇన్‌చార్జిగా హెచ్‌డీ డీటీ మద్దిల కృష్ణమూర్తి, ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు స్థానంలో ఇన్‌చార్జిగా పంచాయతీరాజ్ విస్తరణాధికారి అరసాడ రఘుపతిరావు బాధ్యతలు స్వీకరించారు. టెక్కలి ఎంపీడీఓ కె.విజయలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కె.ఎస్.కొండలరావు(పలాస), వై.వి.రాజేంద్రప్రసాద్(ఇచ్ఛాపురం), వై.పద్మజ(కోటబొమ్మాళి) కూడా ఎంపీడీఓలుగా నియమితులయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాశీబుగ్గ: గొప్పిలి ఫీడర్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ నేపథ్యంలో పలాస మండలం బ్రాహ్మణతర్లా విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పెద్దనారాయణపురం, కేసుపురం, టెక్కలిపట్నం, పెదంచల, చినంచల, గంగువాడ, కేదారిపురం, రాజగోపాలపురం, బంటుకొత్తూరు, అమలకుడియా, టెక్కలిపట్నం, కొమలాపురం, సవరపేట తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎల్.వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రతి కుటుంబానికి తాగునీరు



జలజీవన్ మిషన్ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ దాస్

సోంపేట: ప్రతి కుటుంబానికి ఇంటివద్దకే తాగునీరు అందించడం ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. జింకిభద్ర జగనన్న కాలనీలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.25 లక్షల నిధులతో చేపట్టనున్న ఇంటింటికి కుళాయి పనులను ఎంపీపీ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ తామాడ పద్మావతి, ఉప సర్పంచ్ సాహుకారి జానీ, పెద్దకోట అనంత్, పోకల బాబూరావు, ఎన్ని అజయ్, బత్తుల షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీల ధ్వంసం

ఇచ్ఛాపురం రూరల్: రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా అధికార వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ ఇన్‌చార్జిగా పేరాడ తిలక్, ఇచ్ఛాపురం అసెంబ్లీ ఇన్‌చార్జిగా పిరియా విజయను అధిష్టానం ప్రకటించడం, అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతుండటంతో ప్రతిపక్ష పార్టీలకు కంటిమీద కునుకు లేకుండా పోతుంది. తిలక్, విజయలతో కూడిన ఫ్లెక్సీలను తిప్పనపుట్టుగ - కేశుపురం జంక్షన్‌లో ఏర్పాటు చేయగా గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ విషయమై వైఎస్సార్‌సీపీ నాయకులు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విశ్రాంత ఆర్మీ జవాన్‌కు సత్కారం



హేమారావును సన్మానిస్తున్న గ్రామస్తులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని రెయ్యిపాడుకు చెందిన విశ్రాంత ఆర్మీ జవాన్ సైని హేమారావును సర్పంచ్ బత్సల ధర్మారావు ఆధ్వర్యంలో గురువారం సైనికులు, మాజీ సైనికులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. జనవరి 31న సికింద్రాబాద్‌లోని తిరుమలగిరి ఆర్మీ రిజిమెంట్ నుంచి రిటైర్‌మెంట్ తీసుకున్న ఆయనకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు మద్దిల హరినారాయణ, మాజీ సైనికులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా పనిచేస్తే చర్యలు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు గురువారం సందర్శించారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

జీడిపంటకు గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న చాపర వేణుగోపాలరావు

కాశీబుగ్గ: జీడిపంటకు గిట్టుబాటు ధర వచ్చేలా పార్లమెంట్‌లో ప్రస్తావించాలని, విదేశీ జీడిపిక్కల దిగుమతి తగ్గించాలని వామపక్ష నాయకులు చాపర వేణుగోపాల్, తామాడ సన్యాసిరావు, వంకల మాధవరావు, మద్దిల రామారావు కోరారు. గురువారం కాశీబుగ్గ సీపీఐ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ విదేశీ కరెన్సీని ఇండియాకి తీసుకొస్తున్న జీడిపంటపై ఆధారపడి పలాస-కాశీబుగ్గ పరిసర ప్రాంతాల్లో 1300, రాష్ట్ర వ్యాప్తంగా 1200 వరకు కుటీర పరిశ్రమ నడుస్తున్నాయని చెప్పారు. ఈ పంటనే నమ్ముకుని 10 లక్షల మంది రైతులు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అయినా పంటల జాబితా ధరల పట్టికలో జీడిని చేర్చకపోవడం తగదన్నారు. జీడికి సరైన మద్దతు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎం.భీమారావు, కోనారి ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

తెలగ కులస్తులను బీసీ జాబితాలో చేర్చాలి



పాదయాత్ర చేస్తున్న నాయకులు

కాశీబుగ్గ: తెలగ కులస్తులను బీసీ జాబితాలో చేర్చాలని ఉత్తరాంధ్ర తెలగ కుల సంఘం అధ్యక్షుడు పల్లంట వెంకటరామారావు డిమాండ్ చేశారు. తెలగ కులస్తులను బీసీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు చేపట్టిన పాదయాత్రలో భాగంగా రెండో రోజు పలాస చేరుకున్నారు. గురువారం కాశీబుగ్గ టీకేఆర్ కల్యాణ మండపం నుంచి ప్రారంభమై పలాస మొగిలిపాడు వరకు పాదయాత్ర కొనసాగింది. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పలాస-కాశీబుగ్గ తెలగ సంఘ అధ్యక్షుడు శీలం రూప్‌సుందర్, కౌన్సిలర్ బల్ల రేవతి, బల్ల శ్రీనివాసదొర, పుట్టా లోకనాథం, బుద్దిరెడ్డి, గేదెల శ్రీను, రాజు, భాస్కరరావు, వేణు, గోవింద్ గంగు శ్రీను పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష



కస్తూరిపాడు సర్పంచ్ గోవిందరావు, కార్యకర్తలతో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

కోటబొమ్మాళి : గ్రామాల్లో ప్రతి కుటుంబానికి అందించిన సంక్షేమ పథకాలే రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి కొండంత బలం ఇవ్వనున్నాయని ఎమ్మెల్సీ, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కస్తూరిపాడు, రేగులపాడు, సొడం నారాయణవలస, కోటబొమ్మాళి, కొత్తపేట గ్రామాల్లో పర్యటించి సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలను కలిశారు. రానున్న ఎన్నికల్లో తనతో పాటు పార్లమెంట్ ఇన్‌చార్జి పేరాడ తిలక్ విజయానికి కృషిచేయాలని కోరారు. పీఏసీఎస్ అధ్యక్షుడు బి.మురళి, మండల పార్టీ కన్వీనర్ నూక సత్యరాజ్, సర్పంచులు సుంకర జనార్దన, జి.గోవిందరావు, బమ్మిడి శ్రీనివాస్, సిమ్మన్న, ఎంపీటీసీలు జి. సూర్యప్రకాష్, ఎం.శాంతారావు పాల్గొన్నారు.

పార్కుగా నారాయణదొర కోనేరు



ఉపాధి పనులు ప్రారంభిస్తున్న వెంకటరావు దొర

వజ్రపుకొత్తూరు: నారాయణదొర కోనేరును ఉపాధి హామీ పథకం నిధులతో పార్కుగా అభివృద్ధి చేస్తామని వైఎస్సార్‌సీపీ నేత, జిల్లా ప్రణాళికా బోర్డు మాజీ అధ్యక్షుడు హనుమంతు వెంకటరావు దొర అన్నారు. గురువారం బెండి పంచాయతీ మహదేవిపురంలో నారాయణ దొర కోనేరులో ఉపాధి పనులను వైస్ ఎంపీపీ తమ్మినేని శ్రావణితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి తమ్మినేని శాంతారావు, ఉప సర్పంచ్ తమ్మినేని సుశీల, డి.పాపాయ్య, టి.నాగేశ్వరరావు, రామ్మూర్తి, ఎఫ్ఏ రాజు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

మందస: మండలంలోని అంబుగాం పంచాయతీ పెద్దలింబుగాంలో గురువారం నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సాలిన లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీ మండల లచ్చయ్య పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో తిరునగిరి సవరయ్య, పులారి వీరాస్వామి, దాసరి చంద్రశేఖర్, రేఖారావు, పులారి అప్పలస్వామి, నర్తు రవి, దేవేంద్ర, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న సాయిరాజ్

సోంపేట: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని సోంపేట మేజర్ పంచాయతీలో శ్రీలోకనాథేశ్వర కళాసీ సంఘ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ కోరారు. ఈ మేరకు గురువారం కళాసీ సంఘ భవనంలో సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, ఎంపీటీసీ పాడుగు కామేష్, కళాసీ సంఘ అధ్యక్షుడు రెల్ల లోకనాథం, ఉపాధ్యక్షుడు పొందూరు తేజేశ్వరరావు, కార్యదర్శి పొందూరు రాజారావు, ఉప కార్యదర్శి పొందూరు రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సోంపేట మేజర్ పంచాయతీలో చర్చి వద్ద నుంచి కోదండరామస్వామి దేవాలయం వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ నిమ్మన దాస్‌తో కలిసి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో మత్స్యకార డైరెక్టర్ మద్దు రాజారావు, మండల కమిటీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, జేసీఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, వైస్ ఎంపీపీ గురాల శ్రీను, సోంపేట సర్పంచ్ నగిరి ప్రభావతి, ఎంపీటీసీ పాడుగు కామేష్, కొంచాడ నెహ్రూ, డిల్లీ తదితరులు పాల్గొన్నారు.